కథ

# పెళ్ళంటే....

◆ తోటపల్లి దుర్గాశైలజ ◆

## 'అలంకార్' అనేది సినిమా థియేటర్ పేరు కాదు. ఓ యువకుడి పేరు.

యువకుడు అనడం కంటే వృద్ధుడు అనొచ్చు కాని కాదు. వృద్ధుడు అనడంకంటే, యువకుడే అనడం బాగుంటుందేమో ఎందుకొచ్చిన గొడవ యువకుడికి వృద్ధుడికి మధ్య, నలభైకి, యాభైకి మధ్య ఇంకా పెళ్ళికాకుండా గవర్నమెంట్ ఉద్యోగం వేస్తూ, బతికేస్తున్నాడు. అతను పురాణాల్లో శనిలాగా, ఎప్పుడూ తన్నుతానే మెచ్చుకుంటూ తనకు తానే నచ్చుకుంటూ, మిగతావాళ్ళను బాధించడంలో జీవితాన్ని సాధించడంలో దిట్ట.

పైసా ఖర్చు అవుతుందంటే ప్రాణం పోయినా సరే వదిలేయడం అతని మనస్తత్వపు ఆనకట్ట. ఇప్పుడు అర్జంటుగా అలంకార్ కి ఓ సమస్య వచ్చింది. అదేమిటంటే, నిన్న హనుమంతరావుతో పోటీ పడ్డాడు. ఆ పోటీ ఏమిటంటే నలభైదాటిన నీకు చచ్చినా పెళ్ళికాదు'' హనుమంతరావు గర్జించాడు

''వారం రోజుల్లో నీకు నేను పెళ్ళి చేసుకొని చూపిస్తాను'' అలంకార్ అన్నాడు. ''నీకు పెళ్ళా! ఎవరిస్తార్రా పిల్లని'' హనుమంతరావు గాండ్రించాడు. ''మామూలు పిల్లను కాదురా. అన్ని మసాలాలు వున్న అందమైన తెలుగు పిల్లని ప్రేమించి మరీ పెళ్ళాడుతా'' అని అలంకార్ శపథం చేశాడు. ఈరకంగా యిద్దరికీ రకరకాల జంతుశబ్ద విన్యాసాలు పూర్తయ్యాక ఎట్టకేలకు తెలిసింది ఏంటంటే అర్జంటుగా అలంకార్ ఒక అమ్మాయిని ప్రేమించేసి, పెళ్ళి చేసుకోవడం ప్రస్తుత కర్తవ్యం.

ఆ గొడవ అక్కడికి వదిలేస్తే ప్రస్తుతం అలంకార్ పార్కులో కూర్చొని, తనని వెంటనే ప్రేమించే అమ్మాయి కోసం వెనువెంటనే తలవంచి తాళికట్టించుకునే పడతి కోసం ఎదురు తెన్నులు చూస్తున్నాడు. చూస్తూ చూస్తూ వుండగా దూరంగా బుర్ఖా వేసుకొని ఓ మహమ్మదీయ యువతి వస్తోంది. యువతో, పడతో, కన్నో, వనితో తెలియకపోవడం వల్ల ఎందుకొచ్చిన గొడవ అని చెప్పి, ఆ అమ్మాయిని వదిలేశాడు. కొన్ని పేరు వేరుశనక్కాయలు అయిపోయాయి. అవి తిన్న అలంకారుకీ పెద్ద నష్టంలేదు. వాడికోసం కొన్న పిళ్ళాప్రసాద్ మాత్రం చిరాకు పడుతూ వుండిపోయాడు. అది కూడా వదిలేస్తే ఇప్పుడు ఎలా ఏ అమ్మాయిని ప్రేమించాలి, ప్రేమించే అమ్మాయి ఎలా వుండాలి? ప్రేమించే అమ్మాయిని ప్రేమించడానికి అర్హురాలని ఎలా నిర్ణయించాలి? ఆ అమ్మాయి యొక్క రంగు, రుచి, వాసన ఏంటి? అనే పాయింటుమీద పడ్డాడు అలంకార్.

దూరంగా దుర్గకళామందిర్ థియేటర్ కనిపిస్తూనే వుంది. ఆ థియేటర్ పైన బోర్డింగ్‌లో హీరోయిన్ బొమ్మకూడా కనిపిస్తోంది. ఆ బొమ్మలో వున్న భామ, దిగివచ్చి దగ్గరకు చేరుకొని I Love You అనేస్తే, మన పనైపోతుంది గుండుగాడి ముందు గొడవే వుండదు. కాని అది అలా అనదే. సినిమా కాదే! ఎలా— ఎలా— ఎలా? అనే ఆలోచనలో పడ్డాడు అలంకార్.

చచ్చేవాడికి తులసి తీర్థం, ఆఖరి టిక్కెట్టు కొన్నవాడికి లాటరి, ఆఖరి నిమిషంలో రైలెక్కినవాడికి బెర్తు దొరికితే ఎంత ఆనందపడతారో ఆ విధంగానే యిప్పుడు అలంకార్‌కు అర్జెంటుగా దొరికింది ఒక అద్భుత సౌందర్యరాశి. ఆ అమ్మాయి దూరంగా క్రోటన్ మొక్కల చెట్టు పక్కన దిక్కులు చూస్తూ నిలబడి వుంది. రోజ్ శారి, రోజ్ జాకెట్. మనిషి మంచి పొడగరి. చూపుల్లో తెలుస్తోంది మహా గడసరి అని. అయినా సరే ఆవిడ చూపులు, ఉత్తర బిత్తర. దాంతో మనోడికి ఆనందం పెరిగి ముందుకు కదిలాడు. మెల్లిగా వెళ్ళాడు చుట్టూ చూశాడు. మూడుసార్లు తిరిగాడు. క్రోటన్‌మొక్కల పొదలచుట్టూ... అక్కడే ఆ అమ్మాయి కూడా వుంది. కానీ విషయానికి రాకుండా విషయం చుట్టూ తిరగడం, అలంకార్ కి చిన్నప్పటి నుంచి అలవాటు. అదే చయనంగా, మళ్ళీ తిరిగి, మళ్ళీ తిరిగి, రెండుసార్లు దగ్గాడు. మూడోసారి దగ్గుదాం అనుకుంటే తుమ్ము వచ్చింది. దాంతో బిత్తరపోయి ఆ అమ్మాయి తిరిగి చూసింది. ఆ సుందర్ని చూసి ఓ నవ్వు నవ్వాడు. నవ్వనుకున్నాడు. కాని ఆ అమ్మాయి ఏమనుకుందో ''కడుపు నొప్పిండి దగ్గరలో క్లినిక్ వుంది'' చెప్పింది. కంగారు పడ్డాడు... ''అక్కడ మీరు నర్సా?'' అడిగాడు. ''మీకు జ్యోతిష్యం వచ్చా? నేను అక్కడ నర్సుని అని మీకు ఎలా తెలుసు?''

◆◆◆

> ''నలభై దాటని నీకు చచ్చినా పెళ్ళి కాదు'' హనుమంతరావు గర్జించాడు.

◆◆◆

ఆశ్చర్యంగా అడిగిందామె. పెద్దగా నవ్వుదాం అనుకున్నాడు. తన నవ్వు తనకే అసహ్యం అనిపించిన సమయాలు చాలా వున్నాయి కాబట్టి మానేసి "నాకు కొంచెం అంజనం వెయ్యడం తెలుసులెండి". "అలాగా... ఇప్పుడు నాకొక సమస్య వచ్చి పడిందండి? పెళ్ళికి సంబంధించింది... దానికి సంబంధించిన ఓ అంజనం వేసి చెప్తారా?" అడిగిందామె. "దానికంటె ముందు మీకు ఒక విషయం చెప్తాను... మీరు నన్ను మన్నించి మీ

◆◆◆

నన్ను ప్రేమిస్తావా? అని అడగ్గానే ఆమె హవాయి చెప్పు అతని చెంపకు తగిలింది.

◆◆◆



అభిప్రాయం చెప్పాలి'' అన్నాడు... అయ్యయ్యో, పెద్దవారు మీకు చెప్పకపోవడం ఏంటి. బా...'' అంది. వెంటనే కంగారుపడి...''మీరు అవబోతుంది బాబాయా? ''. ''అబ్బే అది కాదండి... బాధపడకుండా అడగండి అంటున్నాను''. అతను పర్దుకొని గంభీరంగా గొంతు సవరించుకొని ఆ క్షణంలోనే ముష్ఫయిష్ సార్లు మనసులోనే రిహార్సల్ వేసి...''నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు నన్ను ప్రేమిస్తారా? పెళ్ళి చేసుకుంటారా'' అని అడగడానికి ప్రిపేర్ అయి, ఒక్కసారే రావడం వల్లో ఏమిటో నీటి తుంపర గొంతుకు అడ్డుపడి వెంటనే కీచుగొంతుతో, ''మీరు నన్ను ప్రేమిస్తున్నారా?'' అన్నాడు.

ఆ అమ్మాయి కంగారుపడి చుట్టూ చూసి ''ఎవరండి — పొదలకు అవతలవైపు. ఎవరో లవర్స్ అయివుంటారు. వాళ్ళలో అమ్మాయి చూడండి. అబ్బాయిని ఎలా అడుగుతుందో — పాపం అమ్మాయిలు ఈ మధ్య బలె దిగజారిపోతున్నారు'' అంది. ''అబ్బే కాదండి యువతల వైపునున్న నేనే అది... అడగాలనుకున్నాను. చెప్పడానికి అరగంట పట్టింది. ఈలోపు రెండు దగ్గులు, మూడు తుమ్ములు, ఓసారి చీదుకొని, రుమాల్‌తో తుడుచుకొని పక్కనే వున్న కొళాయిలో ఒక్కసారి గాత్రశుద్ధి చేసుకొని, దగ్గరకొచ్చి ఆ తరువాత ముక్కలు ముక్కలుగా అడిగాడు అదే మాటని. ''ప్రేమిస్తున్నాను పెళ్ళి చేసుకుంటాను'' అనే మాట విన్న ఆ అమ్మాయి వెంటనే ఆశ్చర్యపోయి వెనువెంటనే గంభీరంగా ''నిజంగా నన్ను ప్రేమిస్తున్నారా?'' అంది. ''దుర్గకళామందిరం మీద ఒట్టండి. నా పేరు అలంకార్'' అన్నాడు. అనగానే ఆ అమ్మాయి పకపక నవ్వింది. చుట్టూ చూసుకొని ఒకసారి చొక్కా బొత్తాల వంక కూడా చూశాడు. ఎందుకంటే రెండు బొత్తాలు తెగిపోతే పొద్దున్నే పిన్నీస్ పెట్టుకున్నాడు. అదేమన్నా వూడిపోయిందా అని కాని కరెక్ట్‌గానే వుంది. ''ఏమయిందబ్బా'' అని చెప్పువైపు ఓసారి చూసి ఆ సంగతి తరువాత చెప్తాను అనుకున్నాడు. ఎందుకంటే దానికి కింద వున్న బాటం వేరు, పైన వున్న స్ట్రాప్స్‌వేరు. అది కూడా కాదని అర్థమయ్యాక ''ఎందుకు మీరు నవ్వారు?'' ''అదికాదు లెండి నేను అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పండి'' అని మళ్ళీ అడిగింది. హండ్రడ్ పర్సెంట్ మిమ్మల్ని ప్రేమించేశానండి. ప్రేమించకపోయినా పెళ్ళిచేసుకుంటానండి. ఎందుకంటే అది నా బాధ్యత. వృత్తి ధర్మం'' అన్నాడు. ''ప్రేమించకపోయినా, పెళ్ళి చేసుకోవడం వృత్తి ధర్మమా—

◆◆◆

**ప్రేమించకపోయినా పెళ్ళి చేసుకోవడం వృత్తిధర్మమా?**

◆◆◆

మీరేం చేస్తుంటారు?'' ''బ్రతకడానికి • ఏవో చేస్తుంటాంలెండి. కాని ఈ మధ్యన పందెం కట్టి అర్జెంటుగా పెళ్ళి చేసుకునే ప్రయత్నంలోనే తిరుగుతున్నాను. పెళ్ళి చేసుకోవాలి అన్నాడు. మళ్ళీ నవ్వింది ఆ అమ్మాయి. ''ఎందుకండి నవ్వింది'' అన్నాడు.

''కాదండీ. మీరు పెళ్ళి అనగానే మీ అబ్బాయికేమో అనుకున్నాను. మీకేనా!'' అని మళ్ళీ నవ్వింది.

నన్ను ప్రేమిస్తున్నారా లేదా'' అడిగాడు. ''వెంటనే ప్రేమించొచ్చండి. దానికి తప్పేంలేదు కానీ'' అంది. అయితే పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం అన్నాడు. ''అదీ చేసుకోవచ్చండి. దానికేం తప్పులేదు''

''అయితే మనం సంసారం ఎప్పుడు చేద్దాం'' అనబోయి ఆగిపోయాడు. ఎందుకంటే... అది అంటే ఏమవుతుందో అతనికి తెలుసు.

అలంకార్ నవ్వి ''మరి ప్రేమకు తప్పులేదు. పెళ్ళికి తప్పులేదు. మరి ఏమిటంటారు తప్పు?''''దేనికీ తప్పులేదండి'' అంది. ''మరి అయితే ఓకే అంటే కనకదుర్గ గుడుంది. గుడిలో పూజారి ఉన్నాడు. వాడికి డబ్బులు యిస్తే తాళి వస్తుంది. ఆ తాళి యిస్తే పెళ్ళవుతుంది. ఏమంటారు?'' వెంట వెంటనే అడిగాడు. ''ఎందుకైనా మంచిది ఒక్కసారి మావారిని అడిగి చెప్తానండి'' అంది ఆవిడ. ''అడిగెయ్యండి. పెళ్ళనేది మారేళ్ళపంట. ఒక్కోసారి అడగాల్సింది కూడా మీ వారితో చెప్పెయ్యండి'' అన్నాడు తొందర తొందరగా...

అంతలో చంటి బిడ్డను ఎత్తుకుని వచ్చాడు ప్రభు. వస్తూనే చూసి ''ఏమిటే... ఏమిటి ఇక్కడ డిష్కషన్‌లు పెట్టావ్ మళ్ళీ'' అన్నాడు. ''అబ్బే ఏం లేదండి. నేను రాయాలనుకున్న కథకి ఓ మంచి పాయింట్ దొరికింది. ఈయన నన్ను ప్రేమిస్తున్నాడట. పెళ్ళి చేసుకుంటాడట. మీ అభిప్రాయం ఏంటో చెప్పండి'' అంది. అప్పుడుగాని అలంకారుకు అర్థంకాలేదు. భగవంతుడిచ్చిన కళ్ళు, కాళ్ళు, చేతులు అన్నీ అలంకారానికి ఆర్డర్‌లో వుండవని చెప్పి అర్థమయిపోయింది. వెంటనే కంగారుపడిపోయాడు. వెంటనే ప్రభు ''ఏరా నా పెళ్ళాన్ని ప్రేమిస్తావా? అన్నాడు. కాని ప్రభుకి మనిషి కనపడలేదు. చుట్టూ చూసుకుంటే, కాళ్ళమీద వున్నాడు. ''మహా ప్రభో క్షమించండి. మీకు పెళ్ళయిన సంగతి నాకు తెలియలేదు. అందుకే అడిగేశాను. నన్ను ఏమీ అనుకోకండి. ఇంకా ఏదేదో చెప్పాలనుందండి. కానీ ''సారీ'' తప్ప ఏమీ చెప్పలేకపోతున్నాను. వెంటనే ప్రభు అలంకార్ చొక్కా పట్టుకులేపి, మనస్ఫూర్తిగా మనసా, వాచా మూడోదేంటి?'' అన్నాడు. భార్య వెంటనే తల కొట్టుకుంటు ''ఖర్మ'' అంది. ''ఆ... కర్మణా చెప్పు. ఈవిడ్ని ప్రేమిస్తున్నావా? పెళ్ళి చేసుకుంటావా?'' ''అది కాదు గురువుగారూ. మీరు ఆల్ రడీ యిక్కడ రిజర్వు అయ్యారని నాకు తెలియదు. తెలియక అడిగాను'' అన్నాడు భయంగా అలంకార్. ''రిజర్వు అవ్వడం ఏంటిరా. టోకెన్ కూడా వుంటే...'' అని బిడ్డను కూడా చూపించాడు ప్రభు. ''అదే గురువుగారూ నన్ను క్షమించి వదిలెయ్యండి. ఇంకెప్పుడూ మీకు కనిపించను. కావాలంటే ఈ ఊరు నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటాను'' అన్నాడు. ''అవన్నీ వదిలెయ్... ప్రేమిస్తున్నావా? పెళ్ళి చేసుకుంటావా? నన్ను మర్చిపోయిచెప్పు'' అన్నాడు భార్యను చూపిస్తూ.

వెంటనే అలంకారు తడబడకుండా జీవితంలో మొదటిసారి ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు చెప్పినట్టుగా, ''ఔనండి. ప్రేమించాను, పెళ్ళిచేసుకుంటాను'' అన్నాడు. ''అయితే ఇప్పుడే చేసుకో పదేళ్ళ నుంచి పెళ్ళయి చస్తున్నాను దీంతో. ఆ అదృష్టం నాకు కల్పించరా — కావాలంటే నీకు పదివేలు ఇస్తాను''.

అలంకార్ అక్కడలేదు.

ప్రభుకు మాత్రం ఇంట్లో రాత్రి పన్నెండు గంటలకి వాళ్ళావిడ కాపడం పెడుతోంది. ఎందుకంటే ఎనిమిది గంటల నుంచి కొట్టింది కూడా. ఆవిడేగా... అందుకే అంటారేమో.

''కరణేషుమంత్రే కాదు కార్యేషు దాసి'' అని.

●